కథ

# అమ్మా! నన్ను క్షమించొద్దు

డాక్టర్ సి. భవానీదేవి

కిచెన్ సర్దుకుంటున్న సునీత మోహన్‌ని పిలిచింది.

''మోహన్! కొంచెం హెల్ప్ చేయవూ ప్లీజ్'' సునీత అలా అడిగితే కాదనలేడు మోహన్. ఎంత డాక్టరయినా భార్యముందు భర్తే గదా! కొత్తగా ఇల్లు మారి వారం అయినా ఇద్దరికీ డ్యూటీలతోనే సరిపోవడంతో ఇల్లు సర్దుకునే టైం లేదు. ఫ్రిజ్ కనెక్షన్ ఆన్‌చేశాడు.

మోహన్ ''రేపు కూరలు తెప్పిస్తాను సునీతా! ఇంక చాల్లే ఆకలేస్తోంది వడ్డించు'' అంటూ చేయి కడుక్కున్నాడు.

ఇంతలో పక్కింటావిడ గొంతు వినిపించింది మళ్ళీ. ''రాధా! కొంచెం కంచాలు పెట్టమ్మా! అన్నం తిందాం'' కూతురితో అంటోంది.

ఈవారంరోజులుగా ఆవిడ మాటలు వింటూనే ఉంది సునీత. గరిటెలు, గిన్నెల చప్పుడు భోజనాలు చేస్తున్నట్టున్నారు.

''రాధా! నాన్నగార్కి పక్కవేయి. మంచినీళ్ళు దగ్గరపెట్టు. అన్నట్లు టాబ్లెట్లు వేయడం మర్చిపోకు'' పక్కింటావిడ గొంతు వింటూనే సునీత మోహన్‌లు భోజనం ముగించారు.

పక్కింట్లో లైటు ఆరిపోయింది.

అంతా పడుకున్నట్లున్నారు.






సునీత ఇంట్లో ఉన్న టైంలో పక్కింటావిడ గొంతు విన్పిస్తూనే ఉండడం సునీత దినచర్యలో భాగం అయింది. ఆవిడ పేరు జానకమ్మని పనిమనిషి చెప్పింది. ఓసారి వెళ్ళి ఆవిడ్ని పరిచయం చేసుకుందామనుకునేలోపు అర్జంట్ ఫోన్‌కాల్. అమ్మకి బాగాలేదు, వెంటనే రమ్మని. ఆదరాబాదరాగా ఇద్దరూ లీవ్‌లెటర్స్ పడేసి నెల్లూరు వెళ్లారు.

పక్షవాతంతో మంచంలో పడుకున్న అమ్మని చూసి ఏడ్చేసింది సునీత. మోహన్‌కి భార్యని ఓదార్చడం కష్టమైంది. పదిరోజులున్నారు. అమ్మకి కొంత నయం అన్పించాక తిరుగు ప్రయాణమైంది సునీత.

సునీత చెయ్యి పట్టుకుని వదల్లేదు అమ్మ. భయంగా వుందని దగ్గరుండమని బతిమాలింది. కళ్లనీళ్ళు పెట్టుకుంది. తననింత దాన్ని చేసిన అమ్మకి అవసానకాలంలో దగ్గర ఉండడానికి టైం లేదు సునీతకు.

''సెలవు లేదమ్మా! మళ్ళీ వస్తాను'' తల్లికి నచ్చచెప్పి బయలుదేరిందేగాని మనసంతా అమ్మ దగ్గరే వుంది.

మళ్ళీ రొటీన్. ఇద్దరూ ఉద్యోగం చేసే జీవితంలో అమ్మకే స్థానం లేదు. పక్కింటివాళ్ల గురించి చెప్పేదేముంది. కొత్త ఇంట్లోకి వచ్చాక కొత్త పరిసరాలు, పరిచయాలు. అంటీ ముట్టని సిటీ జీవితం.

ఆరోజు ఉదయం నిద్ర లేస్తూనే జానకమ్మగారి గొంతు విన్పిస్తోంది. ఆవిడ ''రాధా! ఇదివ్వు అదివ్వు'' అంటుంటే సునీతకి అమ్మ మళ్ళీ గుర్తొస్తోంది.

''రాధా! దేవుడి పూజకు పూలు కోసుకురమ్మన్నాను తెచ్చావా? ఆ ఇలా పెట్టు. ఈలోగా ఆ కూర కాస్త తరిగిపెట్టు'' జానకమ్మగారి గొంతు ఖంగుమంటోంది.

ఆరోజంతా హడావుడి. కొలీగ్స్‌లో ఎవరిదో పెళ్ళి. సాయంత్రం ఎలాగైనా జానకమ్మగారిని కలవాలి అనుకుంది. బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ టాలీ కావడానికి లేటయింది. ఇంటికి వచ్చేసరికి ఎనిమిదయింది. మోహన్‌కి క్లినిక్‌లో లేటై తొమ్మిదింటికి వచ్చాడు. భోజనాలై అలసిపోయి బెడ్‌మీద వాలిపోయి దుప్పటి కప్పుకుంది సునీత.

అర్ధరాత్రి తలుపులు ఎవరో బాదుతుంటే హఠాత్తుగా మెలకువ వచ్చి ఇద్దరూ లేచారు. తలుపులు తీస్తే ఎదురుగా పక్కింటి పెద్దాయన. గాభరాగా ''డాక్టర్, ప్లీజ్ ఓసారి త్వరగా రండి . జానకికి స్పృహ లేదు''

మోహన్ వెంట పరుగున పక్కింటికి వెళ్లింది సునీత. ఆవిడకి ఇంజెక్షన్ ఇచ్చాడు మోహన్. ''ఫర్వాలేదు భయపడకండి హై టెంపరేచర్‌లో ఇది మామూలే'' బిపి చూస్తూ అన్నాడు.

ఆవిడకి అరవై ఏళ్ళుంటాయి. నెరిసిన జుట్టు, విశాలమైన నుదుట మీద కాసింత బొట్టు, మట్టి గాజులు, జరీ చీర అంతా అమ్మలానే వుంది. ఇల్లంతా కలియజూసింది సునీత. పాత ఫర్నిచర్, పాత తరం ఫోటోలు, పిల్లల ఫోటోలు, రెండు జంటల కలర్‌ఫోటోలు లేటెస్టవి వీళ్ల పిల్లలివి కాబోలు.

జానకమ్మగారు అస్పష్టంగా ''రాధా!'' అని పిలిచారు మెల్లగా.

సునీత ఆయన కేసి చూసి ''రాధని పిలుస్తారా!'' అడిగింది. ఆయన కళ్లనిండా నీళ్ళు. టీవీ పక్కన ఆడపిల్ల బొమ్మని చూపించి కళ్ళు తుడుచుకున్నారు. ఆ బొమ్మ తీక్షణంగా తన హృదయం లోతుల్లోకి చూస్తున్నట్లనిపించింది సునీతకి. చూపులు మరల్చుకుని ప్రశ్నార్థకంగా ఆయనకేసి చూసింది.

''అవునమ్మా! రాధ మా అమ్మాయి. సాఫ్ట్‌వేర్ అబ్బాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని అమెరికాకి వెళ్లిపోయింది. కూతుర్ని వదిలి వుండలేని ప్రేమతో జానకి ఇలా మారిపోయింది. చీటికీ మాటికీ రాధని పిలుస్తూ మాట్లాడుతూ కూతురు ఇంకా ఇక్కడ ఉన్నట్లే పిచ్చి భ్రమ. చాలా ఖర్చు ప్రయాణం. అల్లుడు రాధని పంపడు. కొడుకు కోడలు ఉద్యోగస్తులే. మాతో వుండలేరు. పోయినసారి రాధ వచ్చే ముందు అమ్మా నీకోసం ఏం తెమ్మంటావు అని అడిగింది. ''నీలాంటి ఆడపిల్ల బొమ్మకావాలి'' అంది జానకి ఆ బొమ్మే ఇది'' ముగించాడాయన.

ఇప్పుడా బొమ్మలో రాధకాదు, తనే కనబడుతోంది సునీతకి. మెల్లగా లేచి జానకమ్మ దుప్పటి సరిచేసి బయటికి నడిచింది.

''అమ్మా నన్ను క్షమించొద్దు'' చెమ్మగిల్లిన మనసుతో అనుకుంది సునీత. నెల్లూరులో కదల్లేని తల్లికి కన్నపేగు కదిలినట్లయింది.

★